


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 24-05-2022 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 210 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# టెక్నాలజీ హబ్‌గా విశాఖ

◆ విద్యారంగంలో పెట్టుబడులు ◆ టెక్ మహీంద్రా సీఈవోతో సీఎం జగన్ చర్చలు





దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు రెండో రోజు ఏపీ సీఎం జగన్ పలువురు ప్రముఖులతో వరుసగా సమావేశం అవుతున్నారు. రెండో రోజు ఉదయం సెషన్‌లో ఫ్యూచర్ ప్రూఫింగ్ హెల్త్ సిస్టమ్‌పై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన ఆ తర్వాత దస్సాల్ట్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్ వెర్జలెన్, టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నానీలతో భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపు అంశాలపై ప్రధానంగా చర్చించారు.

**విద్యారంగంలో పెట్టుబడులు**

దస్సాల్ట్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్ వెర్జలెన్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం ఫ్లోరెన్స్ వెర్జలెన్ మాట్లాడుతూ... ఏపీ ముఖ్యమంత్రి జగన్‌తో సానుకూల వాతావరణంలో సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా నైపుణ్యాలను ఎలా అభివృద్ధిచేయాలన్నదానిపై చర్చ జరిగినట్టు తెలిపారు. అదే విధంగా కొత్త తరహా ఇంధనాలపైనా కూడా సమావేశంలో చర్చించామన్నారు. విద్యారంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు దస్సాల్ట్ ఉత్సాహంగా ఉందని ఆమె తెలిపారు.

**విశాఖ కేంద్రంగా ఐటీ**

దావోస్‌లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌కి వచ్చిన టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీతో సీఎం సమావేశం అయ్యారు. ఐటీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి మానవ వనరుల లభ్యత తదితర అంశాలపై వారు చర్చలు జరిపారు. సమావేశం ముగిసిన తర్వాత సీపీ గుర్నానీ మాట్లాడుతూ.. విశాఖపట్నాన్ని మేజర్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి జగన్ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ఇక్కడ నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని టెక్ మహీంద్రాను సీఎం కోరారని తెలిపారు. దీనికి గాను ఆంధ్రా వర్శిటీతో కలిసి పనిచేయాలని

తరువాయి 2లో..

## జపాన్ షిప్పింగ్ కంపెనీ సీఈవోతో సీఎం జగన్ భేటీ



వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా దావోస్‌లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌లో జపాన్‌కి చెందిన ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ మిట్సుయి ఒ.ఎస్.కె.లైన్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్, సీఈఓ తకేషి హషిమొటోతో సీఎం జగన్ సమావేశ మయ్యారు. ప్రపంచంలోనే లార్జెస్ట్ షిప్పింగ్ కంపెనీల్లో ఒకటిగా మిట్సుయి ఉంది. ఏపీలో అభివృద్ధి చేస్తున్న పోర్టులు ఇక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరిపారు.

**స్విస్ పార్లమెంటు బృందం**

మరోవైపు స్విస్ పార్లమెంటు ప్రతినిధి బృందంతో

తరువాయి 2లో..

## రుషికొండ తవ్వకాలపై ఎన్జీటీ స్టే..

### సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి (విజయభాను న్యూస్) : విశాఖలోని రుషికొండ తవ్వకాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విశాఖ వద్ద రుషికొండ తవ్వకాలపై ఇటీవల జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ప్రిన్సిపల్ ధర్మాసనం స్టే విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పర్యావరణ అనుమతులు అన్నీ పొందాకే తవ్వకాలు మొదలుపెట్టినట్లు పేర్కొంది. పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా తవ్వకాలు చేపడతామని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 6న తేదీన ఎన్జీటీ బెంచ్ విచారణ చేసింది. విచారణ చేపట్టిన ఎన్జీటీ..

తవ్వకాలపై అధ్యయనానికి సంయుక్త కమిటీని నియమించింది. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తవ్వకాలు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్జీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## పోలీసుల అదుపులో ఎమ్మెల్సీ అనంతబాబు



కాకినాడ (విజయభాను న్యూస్) : మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసుల ఎదుట లొంగి పోయారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రస్తుతం అనంతబాబును విచారిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతబాబును ఇవాళ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. సుబ్రహ్మణ్యం మృతిపై ఇప్పటికే పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి.

ఈ కేసులో ఎమ్మెల్సీ అనంతబాబును వెంటనే అరెస్ట్ చేయాలని దళిత, ప్రజాసంఘాలతో పాటు వివిధ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసుల ఎదుట ఎమ్మెల్సీ లొంగిపోయారు. అనంతబాబు లొంగుబాటు, సుబ్రహ్మణ్యం మృతి వ్యవహారంపై కాకినాడ పోలీసులు ఈ రోజు సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ఆ ప్రెస్‌మీట్‌లో కేసు వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించే

తరువాయి 2లో..

## కరకట్ట రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

### : మంత్రి ఆదిమూల

అమరావతి: రాజధాని అమరావతిలోని కరకట్ట రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. ఈ పనులను సీఆర్‌డీఏ అధికారులు, వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. చెత్త సేకరణ కోసం రంగులతో కూడిన మూడు గుట్టలు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. 1.13 కోట్లు పంపిణీ చేయగా, మిగిలిన వాటిని కూడా త్వరలోనే అందచేస్తామని పేర్కొన్నారు. 123 మున్సిపాలిటీల్లో 22 చోట్ల ఎన్నికలు నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి అధికారులు తెచ్చారు.

## ప్రభుత్వ భవన నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నిర్మాణ దశలో ఉన్న వివిధ ప్రభుత్వ భవనాల పనులను యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తహశీల్దార్లు మరియు ఎం.పి.డి.ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలలో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెందుర్తి, గోపాలపట్నం, అగనంపూడి లలో సామాజిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనుల అలసత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీస్, అంగన్వాడీ కేంద్రాలు మొదలగు ప్రాధాన్యత భవనాలు సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు మంజూరు అయినప్పటికి ఇంకా పూర్తి కాని భవనాలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

ముఖ్యంగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం మరియు పెందుర్తి మండలాలలో పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదే విదంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం పనుల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాలలో చెత్త డంపింగ్ ప్రదేశాలను గుర్తించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజా మరుగు దొడ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనికి ఆహార పథకం కింద ప్రతి గ్రామం నుంచి కూలీలను నియమించి పురోగతి సాధించాలన్నారు. గ్రామ పంచాయితీల వారిగా సమీక్షలు జరిపి రోజు వారి కూలీల సంఖ్య పెరిగేల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, ఎస్.ఇ.పి.ఆర్, రవీంద్ర, ఎస్.ఇ.ఆర్.డబ్ల్యు.ఎస్, రవికుమార్, ఎస్.ఇ. అర్. అండ్.బి., డి.పి.ఓ, కృష్ణకుమారి, జెడ్.పి. సి.ఇ.ఓ, మున్సిపల్ సిబ్బంది, తహశీల్దార్ లు , ఎం .పి.డి.ఓలు , సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# విపక్షాల విష ప్రచారాన్ని తిప్పి కొట్టండి

## - రెవెన్యూ మంత్రి ధర్మాన పిలుపు - అవినీతి లేని పాలన అందిస్తున్నాం

## - వచ్చే ఎన్నికల్లోనూ దీవించండి

## - ఈ నెల 26 న నిర్వహించే బస్సు యాత్రకు తరలి రావాలని పిలుపు



శ్రీకాకుళం (విజయభాను న్యూస్) : గ్రామాల్లో తిరుగుతూ, క్షేత్ర స్థాయిలో పథకాల అమలు తీరు తెన్నులు తెలుసుకుంటూ కార్యకర్తలు విపక్షాల విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. అదేవిధంగా సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి అర్హులయిన వారిని గుర్తించే బాధ్యత వలంటీర్లదేనని తెలిపారు. శ్రీకాకుళం మండలం, తండేం వలసలో గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పథకాల అమలు అన్నది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని అన్నారు. ఎవ్వరికీ ఏ లోటూ లేకుండా అవినీతికి తావే లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోకే నగదు జమ చేసి, సంబంధిత ఆర్థిక లబ్ధి దక్కేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికీ వారి అర్హతను అనుసరించి ఒక్కో పథకం అందుతుందని, అందరికీ అన్ని పథకాలూ వర్తించవని, దీనిని అర్థం అయ్యే విధంగా వలంటీరు చెప్పాలి అని, అదేవిధంగా వీధిలో ఉండే కార్యకర్త కూడా వివరించాలని కోరారు. ఒక్కో కుటుంబానికి లక్షన్నర నుంచి మూడు లక్షల రూపాయల వరకూ లబ్ధి చేకూరిందని, అసలీ ఆర్థిక ప్రయోజనం అన్నది వాళ్లకు అందకుంటే ఇవాళ పేద కుటుంబాలు ఇంత హాయిగా ఉండేవా? అందుకే మళ్లీ మళ్లీ ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రాధాన్యం ఇస్తూ, మీ మద్దతు ఇవ్వండి అని కోరారు. కరోనా కాలంలోనూ ఇదే విధంగా పూర్తి బాధ్యతతో, ప్రజలకు ఆకలి దప్పికలన్నవి లేకుండా చూసిన ప్రభుత్వం ఇదేనన్న విషయాన్ని గుర్తించుకోవాలని విన్నవించారు. తొలుత బెండివానిపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తరువాత బెండివాని పేటలో కార్యకర్తలతో ఇంట్రాక్ట్ అయ్యారు. పథకాల అమలు జరుగుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. బెండివానిపేటలో చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని అన్నారు. అదేవిధంగా రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, భూములు ఎవ్వరూ అమ్మవద్దని, రానున్న కాలంలో ఇక్కడ మరింత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అప్పుడు భూముల విలువ మరింత పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఆ రోజు బాబు చేసిన తప్పిదాలనూ ప్రస్తావించారు. సమ సమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.



# గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బీచ్ క్లీనింగ్



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) :

రుషికొండ పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇఇ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం 23-04-2022న రుషికొండ బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజం మరియు ప్రకృతి దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ ఎస్ వలంటీర్లు వివిధ గ్రూప్‌లుగా ఏర్పడి ఆర్‌కెబీచ్‌లో ఉన్న చెత్తను సేకరించి జివిఎమ్‌సికి అందజేశారు. బీచ్‌లో వ్యర్థాలు మరియు ప్రకృతి వైపరీత్యాలు వల్ల బీచ్‌ను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలో అక్కడ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఏపీ రాజధాని ఏదంటే దావోస్‌లో జగన్ ఏం చెప్తారు? : లోకేశ్

విజయవాడ: ఏపీ రాజధాని ఏదంటే దావోస్‌లో సీఎం జగన్ ఏం సమాధానం చెబుతారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశ్నించారు. పీపీఏలను రాష్ట్రంలో ఎందుకు రద్దు చేశారని వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో అడిగితే సీఎం ఏమని వివరణ ఇస్తారని నిలదీశారు. కొవిడ్ నిబంధనల ఉల్లంఘనపై నమోదైన కేసులో లోకేశ్ విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "దావోస్‌లో వైకాపా నేతల మీటింగ్ జరుగుతున్నట్టే ఉంది తప్ప పెట్టుబడుల కోసం జగన్ అక్కడికి వెళ్లినట్లు లేదు. దావోస్‌లో పారిశ్రామిక వేత్తలు ఎవరూ జగన్‌ను కలవడానికి రావడం లేదు. గత 24 గంటల్లో ఆయన కలిసిన ఏకైక పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీయే. అదానీని కలిసేందుకు దావోస్ వెళ్లడం దేనికి? దిల్లీ వెళ్లినా ఆయన కలుస్తారు. ప్రత్యేక విమానం కోసమే జగన్ రూ.8కోట్లు ఖర్చు చేశారు. దావోస్‌కు నేరుగా వెళ్లకుండా లండన్ ఎందుకు వెళ్లారు?" అని లోకేశ్ నిలదీశారు. ఏపీలో పోలీస్‌రాజ్యం నడుస్తోందని లోకేశ్ విమర్శించారు. ఏ చిన్న కామెంట్ చేసినా.. సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టినా వెంటనే కేసులు పెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య చేసి తిరుగుతున్నా వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుపై కేసు పెట్టడానికి తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పు చేయనప్పుడు తన కేసులను వెంటనే పరిష్కరించాలని కోర్టును జగన్ అడగొచ్చు కదా అని ప్రశ్నించారు. తన కేసుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని జగన్ అడగగలరా అని లోకేశ్ నిలదీశారు.

# డా.వైస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ పశువుల అంబులెన్స్ సేవలను ప్రారంభించిన నగర మేయర్

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : "డా.వైస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ" పశువుల అంబులెన్స్ సేవలను ప్రారంభించిన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి. సోమవారం ఆమె 2వ జోన్ తోటగరువు ప్రాంతంలో వి.ఎం.ఆర్.డి.ఏ. చైర్ పర్సన్ అక్రమాని విజయనిర్మల తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల కొరకు అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి రెండు "డా.వైస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ" నూతన పథకంలో భాగంగా పశువుల అంబులెన్స్ సేవలను ప్రారంభించారు.రాష్ట్రం మొత్తం మీద 340 పశువైద్య అంబులెన్సులు కేటాయించారని, మొదటి విడతగా 175 అంబులెన్సు ప్రారంభించడం జరిగిందని, రెండో విడతలో 165 అంబులెన్స్ త్వరలోనే ప్రారంభిస్తారని తెలిపారు. నేడు తోటగరువు లో పశు సంచార అంబులెన్స్ రైతుల కొరకు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతుల ఇంటివద్దకే పశు సంచార వాహనం వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తుందని తెలిపారు. గతంలో ఎక్కడో మండల పరిధిలో ఒక పశువుల ఆస్పత్రి ఉండేదని, రైతు యొక్క పశువులకు ఏదైనా వ్యాధి సోకిన ఎడల హాస్పిటల్ కి తీసుకు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడవలసి వచ్చేది, రైతు కష్టం ఎరిగిన ముఖ్యమంత్రి ఈ సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా రైతును ఆదుకోవడం జరుగుతుందని దీనికొరకు 1962 టోల్ ఫ్రీ నెంబరు కేటాయించారని తెలిపారు.



ఈ వాహనంలో వ్యాధి నిర్ధారణ కొరకు రక్త, తేడా పరీక్షలతోపాటు, అత్యవసర పరిస్థితులలో హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా తమ పశువులను హాస్పిటల్స్ కు తీసుకు వెళ్లి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గేదెలు ఆవులు తో పాటు మేక గొర్రె వంటి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ కరుణాకర్ రావు, వైద్యులు శ్రీనివాస్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## పోలీసుల అదుపులో ఎమ్మెల్సీ అనంతబాబు

అవకాశముంది.

**పోలీసుల అదుపులో సుబ్రహ్మణ్యం స్నేహితులు..**

మరోవైపు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తు కొనసాగుతోంది. సుబ్రహ్మణ్యం ఇద్దరు స్నేహితులు పవన్, సుబ్రహ్మణ్యంను పోలీసులు విచారణ కోసం తీసుకెళ్లారు. హత్య జరిగిన రోజు వారిద్దరూ డ్రైవర్ సుబ్రహ్మణ్యంతోనే ఉన్నారు. ఈ విషయంలో సుబ్రహ్మణ్యం స్నేహితుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరి ఆచూకీ తెలపాలని కాకినాడ ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఇద్దరూ తమ వద్దనే ఉన్నారని సర్దిచెప్పిన పోలీసులు.. వారిని పంపించారు.

# టెక్నాలజీ హబ్‌గా విశాఖ

నిర్ణయించినట్టు టెక్ మహీంద్రా చైర్మన్ వెల్లడించారు. మానవ నైపుణ్యాలను పెంచేందుకు, హైఎండ్ టెక్నాలజీపై వచ్చే మూడు నెలల్లో ఆంధ్ర యూనివర్శిటీతో కలిసి ప్రత్యేక పాఠ్యప్రణాళికను రూపొందిస్తామన్నారు అదే విధంగా ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రధాన కేంద్రంగా విశాఖపట్నాన్ని తీర్చిద్దాలనే సంకల్పంతో సీఎం జగన్ ఉన్నట్టు గుర్నానీ వెల్లడించారు.

**మరింత మంది ప్రముఖులతో**

దావోస్‌లో జరుగుతున్న సమావేశాల ద్వారా భారీ ఎత్తున పెట్టుబడులు సాధించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా సదస్సు రెండో రోజు సీఎం పలువురు ప్రముఖులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జపాన్‌కు చెందిన ప్రముఖ రవాణా సంస్థ మిట్సుయి ఒ.ఎస్.కె.లైన్స్ లిమిటెడ్ సీఈఓ తకేషి హషిమొటోతో సీఎం జగన్ భేటీ కానున్నారు. అదే విధంగా హీరోమోటార్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ పవన్ ముంజల్‌తోనూ జగన్ సమావేశం కానున్నారు. చివరగా ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణతోనూ సీఎం జగన్ చర్చలు జరపనున్నారు. ఇంకా మరింత మంది ప్రముఖులనూ ఆయన కలిసే అవకాశం ఉంది.

## జపాన్ షిప్పింగ్ కంపెనీ సీఈవోతో

# సీఎం జగన్ భేటీ




ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ భేటీ అయ్యారు. భారత సంతతికి చెందిన స్విస్ ఎంపీ నిక్లాజ్ శామ్యూల్ గుగెర్ బృందం వరల్డ్ ఎకామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా దావోస్‌కు చేరుకున్న సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో వ్యాపార అవకాశాలపై ముఖ్యమంత్రితో స్విస్ పార్లమెంటు బృందం చర్చలు జరిపింది.

# మహానాడు నిర్వహణపై చంద్రబాబు సమీక్ష



అమరావతి: మహానాడు నిర్వహణపై టీడీపీ అధినేత చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. 40 ఏళ్ల ప్రస్థానం చాటేలా, భవిష్యత్ ప్రయాణాన్ని నిర్ధేశించేలా మహానాడు ఉండాలని సూచించారు. మొదటి రోజు ప్రతినిధుల సభకు 12 వేల మందికి ఆహ్వానం ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండో రోజు అదే ప్రాగణంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్టీ భవిష్యత్ ప్రయాణంపై దిశా నిర్ధేశం చేసేలా మహానాడు కార్యక్రమం ఉండాలన్నారు. వివిధ వర్గాల నుంచి వస్తున్న స్పందన చూస్తే ప్రభంజనంలా మహానాడు ఉండబోతోందన్నారు. ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినంత మాత్రాన మహానాడు ఆగదన్నారు.

# రోటరీ క్లబ్ సేవలు అందరికీ

## సమాజం బాగుండాలనేదే లక్ష్యం

## - రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామారావు

విశాఖపట్నం : రోటరీ క్లబ్ సభ్యులు సమాజ సేవకు అంకిత భావంతో కృషి చేస్తుంటాన్నారు. విశాఖ పట్నంలో ఉన్న దేశంలోనే తొలి నాటక గ్రంధాలయం టి.యస్.ఆర్. కాంప్లెక్స్ లోని రంగసాయి నాటక గ్రంధాలయం కు పది పుస్తక నిక్షిప్త గ్రంధాల ర్యాక్ లను తమ సౌజన్యంతో రోటరీ క్లబ్ పోర్టు సిటీ సభ్యులు అందరూ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం. రామారావు చేతుల మీదుగ గ్రంధాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయికి అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎమ్.రామారావు మాట్లాడుతూ సమాజ సంక్షేమానికి రోటరీ క్లబ్ కట్టుబడి ఉందన్నారు. దేశంలోనే తొలి నాటక గ్రంధాలయం బాదంగీర్ సాయి నెలకొల్పడం. తాము పది ర్యాక్ ల ఏర్పాటు లో మమేకమవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీ.డీ.జీ విశ్వనాథ్., బ్లడ్ బ్యాంకు ఛైర్మన్ జి.ఎస్. రాజు.,అధ్యక్షుడు డి. విశ్వేశ్వర వర్మ., కార్యదర్శి ఆర్.రామకృష్ణ రావు., కోశాధికారి పి. భోగేశ్వరరావు., సంయుక్త కార్యదర్శి ఎన్.ఎస్.ఎన్ రాజు, యు.ఎస్.శర్మ ఈ కార్యక్రమం నిర్వహణలో ముఖ్యభూమిక వహించారు. సంతోష్ బుధా, పీవీ నరసింహం., కళాధర రాజు. కిరణ్ కుమార్., హర్ష్ బైద్., జయదీప్ మిన్నీ తదితరులు కార్యక్రమంలో భాగస్తులయ్యారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ తమ సంస్థ కు రోటరీ విశాఖ పోర్టు సిటీ వారు 10 ఐరన్ రాక్స్ ఇచ్చి ప్రోత్సహించడం ద్వారా మాకు మరింత బలం చేకూరింది అని అలాగే మాకు అవకాశం ఇస్తే రోటరీ క్లబ్ సభ్యులతో నటులున్నారు జాగ్రత్త అనే సందేశాత్మక హాస్య నాటిక ప్రదరిస్తా నన్నారు. ఈ నాటిక ఇప్పటికే సుమారు 75 ప్రదర్శనలు ఇచ్చి ఎందరో నాటక ప్రముఖులు ప్రశంశలు అందుకుందన్నారు గ్రంథాలయ ప్రతినిధులు జమ్మూ చిన్నబాబు, యం. సేనాపతి, దర్శకుడు నవరస మూర్తి పాల్గొన్నారు.

# పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**- అధ్యక్షులు, కార్యదర్శులుగా లాలం, పైల**

**- వరసగా రెండుసార్లు కూడా లాలం, పైలానే అధ్యక్ష కార్యదర్శులు**



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం శ్రీశ్రీశ్రీ పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఆదివారం నాడు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యూ ప్రెస్ క్లబ్ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరి గింది. న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా లాలం కృష్ణారావు, గౌరవ అధ్యక్షులుగా పరవాడ జగదీశ్వరరావు, కార్య దర్శిగా పైల సన్యాసి నాయుడు, ఉప అధ్య క్షులుగా పైల ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు సార్లు కూడా అద్య క్షులుగా లాలం కృష్ణారావును మరియు సెక్రేటరీ గా పైలసన్యాశినాయుడును ఏక గ్రీవంగా ఎన్ను కోబడ్డారు. అనంతరము అద్యక్షులు, సెక్ర టరీలు మాట్లడుతూ న్యూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కశిరెడ్డి అప్పలరాజు, మహేశ్వరావు, చింతి నాగేశ్వరావు, పైల అక్కునాయుడు, బండారు శరణ్ కుమార్, కూండ్రపు రామకృష్ణ, ఈరుగుల లక్ష్మి ప్రసాద్ తథితర్లు పాల్గొన్నారు.

# జగన్ ప్రభుత్వంలో రౌడీషీటర్లకు, నేరచరితులకు పదవులు!!

**- ఎమ్మెల్సీ ఆనంద్ బాబుని కఠినంగా శిక్షించాలి!!**

**- అనంతగిరి మండలం ప్రధాన కార్యదర్శి శెట్టి రాజు డిమాండ్!!**



అనంతగిరి (విజయభాను న్యూస్) : ఇటీవలకాలంలోరంపచోడవరం లో వైసిపి ఎమ్మెల్సీ ఆనంద బాబు చేతిలో లో కారు డ్రైవర్ దళితుడైన సుబ్రహ్మణ్యం మరణంపై ఇప్పటివరకు ప్రభుత్వము స్పందించ లేనందుకు అధికార మద పిచ్చితో ఒక గిరిజన ప్రాంతాన్ని శాసిస్తూ అధికారులను గుప్పేట్లో పెట్టుకొని పలు అక్రమాలు చేస్తూ చీకటి సామ్రాజ్యాన్ని నడుపుతున్న ఆనంద బాబు (అలియాస్) ఉదయ్ భాస్కర్ నీ కఠినంగా శిక్షించాలని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి శెట్టి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ సందర్బంగా అయన విలేకరులతో మాట్లాడుతూ..!! ఎమ్మెల్సీ ఆనంద్ బాబు గిరిజనులను అడ్డుపెట్టుకొని రాజకీయంగా ఎదగడం మొదలు పెట్టాడని, రంపచోడవరం నియోజక వర్గం లో ఆనంద బాబు ఎవరికి నిలబెడితే వారికే ఎలక్షన్లో ఎన్నకలలో పార్టీ టికెట్ ఇవ్వడం గెలిచిన ఎమ్మెల్యే కూడా తను చెప్పినట్టు నడుచుకోవడం అక్కడ పరి పాటి అలాంటి వ్యక్తి యువతులపై బలవంతపు చర్యలకు గురిచేసి గిరిజనులపై దాడులు చేస్తూ హరిజన , గిరిజనులను ప్రాణాలు తీస్తుంటే చట్టం ఉందా లేక ఇలాంటి వారికి చుట్టంగా మారిందా అని అన్నారుఈవిషయం పై ప్రభు త్వము ప్రజలకు సమాధానం చెప్పాలని సుబ్రహ్మ ణ్యం పొట్టనపెట్టు కున్న ఎమ్మెల్సీ ఆనంద్ బాబు నీ ఎస్సీ ఎస్టీ కేసులే కాకుండా అతని చేతుల లో మోసపోయి న యువతుల స్టేట్మెంట్ వాంగ్మూలం తీసు కొని వాటి ఆధారంగా దిశా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, మండల బిజెపి మండల ప్రధాన కార్యదర్శి శెట్టి రాజు,మండల అధ్యక్షుడు వంతల తమ్మన్న,యువ మోర్చా అధ్యక్షుడు పాండవుల బంగారు నాయుడు,గిరిజన మోర్చా అధ్యక్షుడు పొంగి నాగేశ్వరరావు,కిషన్ మోర్చా అధ్యక్షుడు అడ్డాల భీమరాజు, మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి సమరెడ్డి రామస్వామి మండల ఉపాధ్యక్షుడు సిహెచ్ సింహాద్రి, అప్పన్న,పాండు,అప్పలస్వామి కంబిడి జనార్ధన్, కోనేపు చెల్లయ్య డిమాండ్ చేశారు.

# యోగా, పురాణ, ఇతిహాసాలపై.. శిక్షణా తరగతులు ప్రారంభం..



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : యోగా.. శారీరిక, మానసిక దారుఢ్యానికి.. ఎంతగానో దోహద పడుతుందని.. ప్రముఖ సంఘ సేవకులు, వైసిపి యువ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ అన్నారు.. పురాణ, ఇతిహాసాలపై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. పాత నగరంలో ఉన్న..వివేకానంద సంస్థలో.. యోగా, పురాణ, ఇతిహాసాలపై.. అవగాహన, వేసవి శిక్షణా తరగతులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రారంభించారు.. ఈ శిక్షణా తరగతుల్లో.. యోగా శిక్షణతో పాటు పురాణ, ఇతిహాసాలైన.. రామాయణం, భాగవతం మొదలైన గ్రంధాల గురించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తారు.. ప్రతీరోజు ఉదయం 10.30 నుండి 12.30 వరకు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలియజేశారు. ఆధ్యాత్మికవేత్త, గురువులు కోదండరావు సారధ్యంలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. భారతీయులు ఎంతో పవిత్రంగా భావించే.. రామాయణ, మహాభారత గ్రంథాలను విద్యార్థినీ విద్యార్థులకు అందించటానికి సంస్థ చేస్తోన్న కృషిని ద్రోణంరాజు అభినందించారు. ప్రతీరోజు నేర్చుకున్న పాఠాలను బాగా అధ్యయనం చేసి, ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మంచి బహుమతులను కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. విద్యార్థిని, విద్యార్థులందరూ.. ఈ వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డి .ఎస్. అగర్వాల్, ఎల్లాజీ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ని శిక్షించాలని టీడీపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు తన డ్రైవర్ ని హత్య చేసినందుకు నిరసనగా ఆదివారం భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో భీమిలీ నియోజకవర్గ పరిధిలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తన డ్రైవర్ పై హత్య చేయడం దారుణమనీ అన్నారు. ఎమ్మెల్సీ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో టీడీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

టెక్కలి ఎన్నికల పరిశీల కులు గంటా నూకరాజు మాట్లాడుతూ ఇటీవల వైకాపా అధికారంలో చాలా సంఘటనలు జరుగు తున్నాయనీ చెప్పారు. కాకినాడ ఎమ్మెల్సీ తన డ్రైవర్ ను హత్య చెయడం బాధా కరమని చెప్పారు.

తను చేస్తున్న తప్పుడు పనులు ఎవరికైనా చెపుతారనే భయంతో ఈ విధంగా హత్య చేయించడంతో ఆ కుటుంబం పడుతున్న బాధను ఎవరు తీర్చగలరనీ చెప్పారు. ఇలాంటి వాళ్ళకు మామూలు శిక్షలు చాలవనీ కఠినంగా ఉండాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పతివాడ రాంబాబు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జాతీయ రహదారి సూర్యనగర్లో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామివారి ఆలయంలో మంగళధ్వని వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ పాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో అత్యంత వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి వారు స్వర్ణ కవచ ధారిగా భక్తులకు దర్శనమిచ్చారు ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీకాంత్ ఆచార్యులు వారి బృందం వేద పఠనంతో ముందుగా విశ్వక్సేన ఆరాధన , పుణ్యా హవాచనం, రుత్విక్ వరుణ అంకు రార్పణ , అగ్ని ప్రతిష్ట , హెూమములు , అష్టోత్తర శతకలశారాధన , ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు , శ్రీరామ అష్టోత్తరం, శ్రీ ఆంజ నేయ అష్టోత్రం నిర్వహించారు . తదుపరి యోగసిద్ధాం జనేయ స్వామి వారికి దూప దీప నైవేద్యం మంగళ హారతి మంత్రపుష్పం సమర్పించారు . ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థగోష్టి , తీర్థ ప్రసాదములు వితరణ చేశారు . ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెనుమత్స సుబ్బరాజు దంపతులు ఆలయ కమిటీ సభ్యులు , స్వామివారి సేవకులు , పరిసర ప్రాంత వాసులు భక్తులు పాల్గొన్నారు. శ్రీరామ నామస్మరణ చేస్తూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# గ్యారేజి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**జోన్ I డిప్యూటీ సి.ఎం.ఇ**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : గ్యారేజి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ జోన్ I డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ శ్రీ అప్పలనాయుడు చెప్పారు. సోమవారం వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మెరుగైన వసతుల రూపకల్పనకు కృషి చేస్తానని అన్నారు. గ్యారేజి సమస్యలు పై విశాఖ జిల్లాలో పాటు అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు జిల్లాల ఉద్యోగులు సంప్రదించాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేయడం మంచి నిర్ణయం అని చెప్పారు. గ్యారేజి ఉద్యోగులు పరిమితి సంఖ్య లో ఉంటారని, అక్కడ వివక్ష చూపరాదని అధికారు లకు సూచించడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా భాగంగా ఫెడరేషన్ నాయకులు అయినను శాలువతో సత్కరించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.వి.వి.సత్య నారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి జి.పి.రావు, జోనల్ నాయకులు కళ్యాణ్, రీజినల్ నాయ కులు అప్పల రెడ్డి, వాలేరు డిపో అధ్యక్ష, కార్యదర్శి సోమ్ బాబు, చంద్రరావు, మద్దిల పాలెం డిపో అధ్యక్ష, కార్యదర్శి వై.వి.ఎస్.ఏ .రాజు, పి.చిన్న, నర్సీపట్నం డిపో అధ్యక్ష, కార్య దర్శి దేముడు శంకర్ నాయకులు పాల్గొన్నారు.

# పనుల ప్రగతి పరిశీలన

**వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి**



భవనాన్ని పరిశీలిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ, (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నూత నంగా నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్ పనుల ప్రగతిని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సోమవారం ఉదయం పరిశీలించారు. భవన నిర్మాణం పూర్తయి తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ప్రస్తుతం ఎలివేషన్, పెయింట్ పనులను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రత్యక్షంగా పరిశీలించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వీసీ వెంట ఆర్కిటెక్ భీమేష్, ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు ముందు పట్టాలకు అర్హులైన వారు ఇప్పుడు ఎందుకు అర్హులు కారు

**టీడీపీ పార్లమెంటరీ సెక్రటరీ పిట్టా సురేష్**

భీమునిపట్నం : పట్టాల పంపిణీ కార్యక్రమం చాలామందికి నిరాశ కలిగిం చిందని టీడీపీ పార్లమెంటరీ సెక్రటరీ పిట్టా సురేష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు సుమారు పది వేల మందికి హామీ పత్రాలు అందజేసి పంపిణీ కార్యక్రమంలో మూడు వేల మందికి మాత్రమే పట్టాలు ఇవ్వండ పై ఎన్నికలకు ముందు అర్హులైన వారు ఇప్పుడు ఎందుకు అర్హులు కాదో తెలపాలని డిమాండ్ చేసారు. పట్టాలు వచ్చాయనీ సంతోషం ఉందా అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళస్థలం 1.5 సెంట్ల స్థలం కేటాయిస్తామని చెప్పి ఒక సెంటు స్థలానికి మాత్రమే పత్రాలు అందజేశారనీ, ఇంతవరకు అర్బన్ ప్రాంతంలో అన్ని వసతుల మధ్య నివసిస్తున్న వారికి కనీస మౌలిక వసతులు లేని ప్రాంతంలో ఇల్లు నిర్మాణం వెంటనే ప్రారంభించాలని నిబంధనలతో కూడిన పత్రాలపై సంతకాలు చేయించుకొని ఇల్లు నిర్మాణం ప్రారంభించక పోయినట్లయితే ఇళ్ళ పట్టాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారనీ. ప్రభుత్వం అందించే లక్షా ఎనభై వేల రూపాయలతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తవుతుందనీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమం ప్రదాన ఉపాధ్యాయరాలు మొకర పద్మా వతి అధ్యక్షత న జరిగింది.

# విజయభాను సంపాదకీయం

## టెక్నాలజీ ఆధారిత పరికరాలతో....

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హెూటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ఏర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది.

యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే స్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేకపోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొందరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

# అత్యాచారము మరియు పోక్సో కేసులో నిందితులకు కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా

**- తీర్పు వెల్లడించిన పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి**

**- శిక్షలు పడేందుకు వాదనలు వినిపించిన ఎస్.పీ.పీ కరణం కృష్ణకు పలువురు అధికారులు అభినందనలు**

విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్) : అత్యాచారం నేరం రుజువు కావడంతో నిందితులకు పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి సోమవారం సంచలన తీర్పు చెప్పారు.

విశాఖపట్నం జిల్లా పోక్సో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ బాధితుల తరపు వాదనలు విన్న న్యాయమూర్తి ఈ తీర్పును వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం క్రిష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ కేసులో నిందితుడైన A-1 పుల్లకందం సతీష్ కుమార్ తండ్రి లేట్ వైకుంఠరావు, 15 సంవత్సరాల బాలికను ప్రేమ మరియు పెండ్లినీ కారణముగా చూపించి, A-2 పుల్లకందం సంతోష్ కుమార్ తండ్రి లేట్ వైకుంఠరావు మరియు A-3 పుల్లకందం గిరిజ భర్త లేట్ వైకుంఠ రావు ల సహాయంతో, చట్టవిరుద్ధంగా సదరు 15 సంవత్సరాల మైనర్ బాలికను ఆమె యొక్క తల్లిదండ్రుల సంరక్షణ నుండి తీసుకొనిపోయి, బలవంతముగా పెండ్లి చేసుకుని మైనర్ బాలికను శారీరకముగా అనుభవించడంమైనది.

పై విషయమై ఫిర్యాదు మేరకు న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్లో క్రైమ్.నెంబర్.86/2015 u/s 366, 376 (2), (i), (n) ఐపీసీ మరియు సెక్షన్ 4 అఫ్ పోక్సో యాక్ట్ కేసును అప్పటి ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాసు రిజిస్టర్ చేసి, దర్యాప్తు అనంతరం నిందితులైన A-1 పుల్లకందం సతీష్ కుమార్ తండ్రి లేట్ వైకుంఠరావు, బ్రాహ్మిన్, నివాసము ఫ్లాట్ నెంబర్-21, జన priva వెస్ట్ సిటీ, మియాపూర్, హైదరాబాద్ N/o గంగమ్మ పేట, జిఅమ్మవలస మండలం, విజయనగరం జిల్లా A-2 పుల్లకందం సంతోష్ కుమార్ తండ్రి లేట్ వైకుంఠరావు, బ్రాహ్మిన్, నివాసం ఫ్లాట్ నెంబర్-21, డాల్ఫిన్ హైట్స్ అపార్ట్మెంట్, దాసన్నపేట, విజయనగరం జిల్లా N/o గంగమ్మ పేట, జిఅమ్మవలస మండలం, విజయనగరం జిల్లా మరియు A-3 పుల్లకందం గిరిజ భర్త లేట్ వైకుంఠ రావు, బ్రాహ్మిన్, N/o గంగమ్మ పేట, జిఅమ్మవలస మండలం, విజయనగరం జిల్లా అను వారిని కోర్టులో హాజరు పరచడమైనది.

ఈ కేసులో న్యాయస్థానం కేసు విచారణ అనంతరం నిందితులైన A-1, 1 పుల్లకందం సతీష్ కుమార్, A-2 పుల్లకందం సంతోష్ కుమార్, A-3 పుల్లకందం గిరిజ లకు u/s 366 IPC మేరకు 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు Rs.10,000/- జరిమానా & u/s section 4 of పోక్సో యాక్ట్ మేరకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు Rs.10,000/- జరిమానాను నిందితులకు శిక్ష విధించారు. బాధితుల తరుపున కేసును వాదించి, నిందితులకు కఠినమైన శిక్షలు పడేందుకు వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణకు పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.



తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం, బిమడోలు మండలం, కొమరిపాలెం గ్రామంలో సచివాలయం-1, సచివాలయం- 2 సొసైటీ బిల్డింగ్ ప్రారంభోత్సవాలు, మరియు కళావేదిక శంఖుస్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చి నేటికి 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేకుని కట్ చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.

# కవి సమయం

## శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావధి మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు


# పంచాంగం

| | |
|---|---|
| మాసం : వైశాఖ; తిథి :నవమి ప.2.44; పూర్వాభాద్ర రా.2.14; ఉ.వ.9.01ల 10.35. | మంగళవారం 24-05-2022 |

a **మేషం** : ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. b **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. C **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. d **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం˝మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. f **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతరత్రా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. k **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. L **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది.

# సంకీర్తన

# పరమ పవిత్రం... కేదారం





ద్వాపరయుగంలో కురుక్షేత్ర యుద్ధం అనంతరం పాండవులు విజేతలుగా నిలుస్తారు. అయితే యుద్ధంలో తమ సొంత దాయాదులను చంపవలసివచ్చినందుకు ఎంతగానో వేదనకు గురవుతారు. తమ పాపాల నుంచి విముక్తి పొందేందుకు మహేశ్వరుని దర్శనం కోసం హిమాలయాలకు చేరుకుంటారు. ఈశ్వరుడు వృషభరూపంలో కేదారం వద్ద వుండటాన్ని పాండవులు గమనిస్తారు. వారు వచ్చేలోగా శివుడు భూమిలోకి వెళ్లిపోతాడు. పాండవులకు మూపురం మాత్రమే దర్శనమిస్తుంది. ఆ దర్శనంతో పాండవులకు పాప విముక్తి కలుగుతుంది. భూమిలోకి వెళ్లిన పరమేశ్వరుని ముఖ భాగం నేపాల్‌లోని పశుపతినాథ ఆలయంలో వున్నట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. మధ్యమహేశ్వర్, తుంగ్‌నాథ్, రుద్రనాథ్, కల్పేశ్వర్, కేదార్‌నాథ్... ఈ ఐదింటిని పంచ కేదార్‌నాథ్ క్షేత్రాలుగా పేర్కొంటారు.

పరమేశ్వరుని సన్నిధానాల్లో పరమ పవిత్రమైనది కేదార్‌నాథ్ మహాక్షేత్రం. హిమగిరుల్లో నెలకొన్న ఈ క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా యుగయుగాలుగా వేలాదిమంది భక్తుల పూజలు అందుకుంటోంది. రుద్రహిమాలయ పర్వత ప్రాంతాల్లోని ఈ క్షేత్రాన్ని దర్శించాలంటే భక్తులు చాలా శ్రమించాల్సి వుంటుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ్ జిల్లాలోని పర్వతాల్లో పరమశివుడు కేదారేశ్వరుడిగా భక్తులకు దర్శనమిస్తారు. శీతాకాలంలో ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఆలయాన్ని తెరవడం సంప్రదాయంగా వస్తోంది. మందాకిని నది జన్మస్థానం కూడా కేదార్‌నాథ్ సమీప పర్వతాల్లోనే వుంది.

***స్వయంభువుగా శివుడు..***

పరమశివుడు ఇక్కడ స్వయంభువుగా భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంటాడు.

***ఆధ్యాత్మిక శిఖరం..***

మంచుకొండల్లోని కేదార్‌నాథ్ క్షేత్రానికి చేరుకోవడం అత్యంత శ్రమతో కూడుకున్న పని. కానీ శివానుగ్రహం భక్తుల్ని ఆ ఇబ్బందులనుంచి దూరం చేస్తుంది. ఇక్కడ ఆలయాన్ని పాండవులు నిర్మించారని తెలుస్తోంది. అనంతరం ఆదిశంకరాచార్యులు ప్రాచీన ఆలయానికి సమీపంలోనే ప్రస్తుతం మనం చూసే ఆలయాన్ని నిర్మించారు. ఎన్నో వందల సంవత్సరాలు మంచుతో కప్పబడిన మహాపుణ్యక్షేత్రం అనంతరం దర్శనమివ్వడం భగవద్ అనుగ్రహమే. ఆదిశంకరులు ఇక్కడి నుంచే కైలాసానికి చేరుకున్నట్టు ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆదిశంకరుల సమాధిని కూడా ఆలయ సమీపంలో దర్శించవచ్చు. మంచు కొండల నడుమ పెద్ద పెద్ద రాళ్లతో ఆలయాన్ని నిర్మించడం దైవానుగ్రహమని పెద్దలు చెబుతారు. ఆలయం ముందు భాగంలో కుంతీదేవి, పాండవులు, శ్రీకృష్ణ విగ్రహాలు వుంటాయి. ఆలయం ముందు నంది విగ్రహం వుంటుంది. ఆలయంలో పరమశివుడు సదాశివమూర్తిగా దర్శనమిస్తారు.

***కొండలనెక్కి... శ్రమను అధిగమించి..***

ఉత్తరాఖండ్‌లోని పవిత్రపుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను దర్శించుకోవడాన్ని మినీ చార్‌ధామ్ యాత్రగా పేర్కొంటారు. కేదార్‌నాథ్ ప్రయాణం క్లిష్టంగా వుంటుంది. రిషికేశ్ నుంచి గౌరీకుండ్ వరకు సులభంగా చేరుకోవచ్చు. గౌరీకుండ్ నుంచి గుర్రాలు, డోలీలు లేదా కాలినడక ద్వారా ప్రయాణించాల్సి వుంటుంది. హిమపాతంతో కూడిన ప్రతికూల వాతావరణంలో భక్తులు ప్రయాణించాలి. హెలికాప్టర్ల సర్వీసులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కల్పించింది. కానీ ఈ ప్రయాణానికి ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయి. సముద్రమట్టానికి దాదాపు 3500 మీటర్ల ఎత్తులో వుండే కేదార్‌నాథ్‌ను చేరుకోవడంతో బడలిక మొత్తం ఎగిరిపోతుంది. ఆ నీలకంఠుని దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

# అనకాపల్లి జిల్లా సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షులుగా చింతకాయల



పరవాడ (విజయభాను న్యూస్): అనకాపల్లి విజయ రెసిడెన్సీ హోటల్ లో జరిగిన అనకాపల్లి జిల్లా సర్పంచ్ ల సంఘం జరిగిన ఎన్నికలలోజిల్లా అధ్యక్షులుగాడాక్టర్ చింత కాయల సూజాత ముత్యాలు ని ఎకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.జీల్లా ప్రదాన కార్యదర్శి గా మల్లే లోవరాజు( పాయకరావుపేట నియోజకవర్గం)ఉపాధ్యక్షులు గాసరళ సూరి బాబు (చోడవరం నియో జకవర్గం)2 ఉపాధ్యక్షులు సప్పవరపు లక్ష్మి ప్రసన్న వరహాలుబాబు (అనకాపల్లి నియోజకవర్గం)కార్యదరి లుగా చదరం వెంకట సూరి గణేష్ నాయుడు (ఎలమంచిలి నియోజకవర్గం )కోసాదికారిగా బోడ్డు సత్యనారాయణ (నర్సీపట్నం నియోజకవర్గం )కార్యవర్గ సభ్యులుగా కారె రామారావు, కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, జనపరెడ్డి శ్రీనివాసరావుగోల్లగాని శ్రీను, అల్లు వెంకట ప్రసాద్ లనుసర్పంచ్ లు అందరూ ఎకైగ్రీవ్రంగా ఎన్ను కోవడం జరిగింది' అనంతరము అద్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలు మాట్లడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామనీ అన్నారు. జిల్లాలో గల సర్పంచ్ లు తథితర్లు పాల్గోన్నారు.

## నిమ్మలపాడు, కరకవలస, రాళ్లగెడ్డ లో తీస్తున్న అక్రమ మైనింగ్ ఆపాలి జెడ్పీటీసీ దీసరి గంగరాజు

అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలంలోని వాలాసి పంచాయతీ నిమ్మలపాడు కరకవలస రాళ్ల గెడ్డ గ్రామా లకు ఆనుకుని ఉన్న కాల్ సైట్ మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలని సిపిఎం జెడ్పిటిసి.దీసరి. గంగరాజు ఆధ్వ ర్యాన సోమవారం తాహిశీల్దార్ కార్యా లయం వద్ద ఆందోళన ఉప తహశిల్దార్ నక్కా పాత్రుడు కు కలిసి లిఖిత పూర్వకంగా విన్నవించారు. ఈ కార్య క్రమంలో సి పి ఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు. అనంతగిరి వార్డు మెంబర్లు జె. సుబ్బారావు చిటం.వెంకటరావు. గ్రామస్తులు వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.



# మినీమహానాడు జయప్రదం చేయాలి

అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : ప్రజలకు ఎ సమస్యలు ఎదురైనా తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు . సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు . అచ్చుతాపురం సుప్రజా డైరీ ఎదురుగా లేపాక్షి ఏసీ కళ్యాణ మండపంలో నేడు జరుగుతుందని మండలంలో ఉన్న మాజీ ఎంపీపీ లు , మాజీ జెడ్పీటీసీలు సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ శాఖ అధ్యక్షులు అనుబంధ కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని మినీ మహానాడు పసుపు పండుగను జయప్రదం చేయాలన్నారు . ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జనపరెడ్డి నర్సింగరావు ,మండల ఐ టిడిపి ఇన్చార్జ్ పతివాడ చిన్నయ్య నాయుడు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల కమిషన్ కు మల్లాడి ఫిర్యాదు



యానాం(విజయభాను న్యూస్): యానాంలో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల విధులు ఉల్లంఘించిన ఉద్యోగులందరూ పై చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి స్టేట్ ఎలక్షన్ కమిషనర్ రాయ్ పి థామస్ కు పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఫిర్యాదు చేశారు పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ కార్యాలయంలో కలిసి ఫిర్యాదు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో సదరు ఉద్యోగులకు ఎన్నికల విధులను కేటాయించాకుండా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మల్లాడి కోరారు.

జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ ను మల్లాడి కోరినట్లు తెలిపారు.

# గిరిజన పేద విద్యార్థులకు పౌష్టికాహారం మరియు పుస్తకాలు పంపిణీ




అనంతగిరి (విజయభాను న్యూస్ ) : అనంతగిరి, విజయభాను న్యూస్, " సమీద " స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యం లో బైబిల్ టబర్నికల్ చర్చి - అమెరికా వారి సహకారంతో అనంతగిరి మరియు రావికమతం మండలాల లోగల 12 గిరిజన గ్రామాలకు చెందిన 420 మంది విద్యార్థులకు పుస్తకములు , పండ్లు , వేరుసెనగ చక్కలు, బిస్కట్లు, మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు, ఉచితంగా పంపిణీ చేయుట జరిగింది . కార్య క్రమము లో భాగంగా చప్పాడి, డెక్కాపురం తోకవలస, పెదబిడ్డ, లక్ష్మీపురం, మర్దగూడ, తాటి గూడ , గ్రామాలలో 420 మంది పిల్లలకు 21, 22 వ తేదీలలో పంపిణీ చేయుట జరిగింది.

కార్యక్రమములో నేడు మర్దగూడ గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ సభ్యులు అయిన దీసరి గంగరాజు మరియు ఎగువశోభ సర్పంచ్ సింహాద్రి మరియు అనంతగిరి సర్పంచ్ శ్రీమతి రూతు లు పాల్గొని మార్దగూడ మరియు లక్ష్మీ పురం గ్రామాల ఆశా కిరణ్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రత మరియు న్యూట్రిషియన్ ఫుడ్ యొక్క ప్రాముఖ్యత పై విద్యార్థులకు వివరిం చుట జరిగింది అనంతరం పిల్లలకు పంపిణి చేయుట జరిగింది.

కార్య క్రమములో "సమిద" కార్యదర్శి వీరభద్రరావు మాట్లాడుతూ బైబిల్ టబర్నికల్ చర్చి - అమెరికా వారి సహకారంతో సంస్థ ఎంపిక చేసిన 15 గ్రామాలలో పేద పిల్లలకు అందించుట జరుగుచున్నదని అదేవిదంగా పిల్లల మానసిక మరియు శారీరక ఎదుగుదలకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, తల్లి తండ్రులు తమ ఇంట్లో కూడ మంచి పోషకాలు కూడిన ఆహారంను తయారు చేసుకొని పిల్లలు ఇమ్యూనిటీని పెంచు కోవాలి అని అదే విదంగా పిల్లల ఆరోగ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రత గూర్చి అవగాహన కల్పించుట జరుగుచున్నదని , పిల్లల విద్యాభివృద్ధి కొరకు ' సమిద ' సంస్థ కృషి చేయుచున్నదని అందుకొరకు మారు మూల గిరిజన గ్రామాలలో ఆశా కిరణ్ పేరుతో ప్రత్యామ్నాయ పాఠశాలలు నిర్వహిస్తు వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి విద్యాభివృద్ధి కొరకు సంస్థ కృషి చేయుచున్నదని , అదేవిదంగా మరి కొంత మంది స్థానిక దాతల విరాళము లతో కూడా ఈ కార్యక్రమమును మరి కొన్ని ఇతర గిరిజన గ్రామాలలో పేద విద్యార్థు లను కూడా కలుపుకొని కార్యక్రమము నిర్వహించుట జరుగుచున్నదని తెలియజేసారు. కార్య క్రమనంలో 'సమీద ' అద్యక్షులు , పడాల రమణ , మరియు సంస్థ పాలక వర్గ సభ్యులు డి. వరలక్ష్మి మరియు కోఆర్డినేటర్ దీసరి బుద్ధరాజు, సింహాద్రి, ప్రసాద్, అప్పలరాజు , సుదాకర్ , బిడ్డాప్రసాద్ , దేముడమ్మ , నాగు , హేమత్, తదితరులు పాల్గొన్నారు.

# సంపద తయారీ కేంద్రాలను సందర్శించిన ఈవో



దేవరాపల్లి, విజయభాను న్యూస్ : సంపద తయారీ కేంద్రాలు తో సహజ ఎరువు లను తయారు చేసు కునేం దుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్య క్రమాన్ని ప్రారంభించిందని అందువల్ల

ప్రతి గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రాలు ను వాడుకలోనికి తీసుకు రావాలని దేవరాపల్లి పంచా యితీ ఈవో ఎస్. శ్రీని వాసరావు అన్నారు. సోమ వారం మండలంలోని పెద నందిపల్లి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ సచివాలయ సిబ్బంది కు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరి బయలుదేరిన సిబ్బంది




యానాం(విజయభాను న్యూస్): యానాం లో పలు ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్, ఎన్ ఎమ్ ఆర్ లు సోమ వారం యానాం నుండి బయలుదేరి పుదుచ్చేరి వెళ్లారు మంగళవారం ఉదయం పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్ష సమావేశం పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి ని కలవనున్నారు ఏళ్లతరబడి ప్రభుత్వ శాఖ లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వ గుర్తింపు లభించకపోవడంతో వీరందరి సమస్యలు పరిష్కరించే విధంగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి సమక్షంలో చర్చించి సమస్యలు నమస్కరించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరనున్నారు యానాం నుండి సుమారు 65 మంది మల్లాడి కృష్ణా రావు ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులో బయల్దేరి వెళ్లారు ఈ సందర్భంగా సిబ్బంది పలువురు మాట్లాడుతూ మాకు వేతనాలు లేకపోవడం వల్ల మల్లాడి అందించిన సహాయ సహకారాలతో పుదుచ్చేరి వెళ్లినట్లు తెలిపారు.

# ప్రజా పంపిణీ సరుకులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కార్డు దారునికి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజా పంపిణీ సరుకులను అందించే విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సి ఎస్ డిటీ వి.రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లో డీలర్లు మాట్లాడుతూ, ప్రజాపంపిణీ లోని నాణ్యత పాటించినప్పటికీ గోదాంలో అందిస్తున్న సరుకులు సరైన కొలత కు రావడం లేదని సుమారు 70 నుంచి 100 కేజీల వరకు నష్టపోవాల్సి వస్తుందని, ఈ విషయమే గత ఆరు నెలల కాలం తెలపడం జరిగిందని, అప్పుడు సరిచేసి కొలత బాగానే ఉండేదని, మరల గత రెండు మూడు నెలల నుంచి ఇదే కొలత సమస్య వస్తుందని చెప్పినప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన సి ఎస్ డి టి రాజ్యలక్ష్మి త్వరలోనే ఈ విషయమై దర్యాప్తు జరిపి తగు పరిష్కారం చూపుతామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీలర్లు అంతా పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలని ధ్వంసం చేశారని ఫిర్యాదు

అనందపురం (విజయభాను న్యూస్) : భీమిలీ నియోజక వర్గం ఆనందపురం మండలం వేములవలస మరియు వివిద ప్రాంతాల లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వేముల వలస ఉప సర్పంచ్ కోరాడ. నవీన్ జ్ఞానే శ్వర్ పోలీసులకి పిర్యాదు చేశారు.నవీన్ తండ్రి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణ్ రావు తో కలిసి ఉన్న ఫ్లెక్స్ లని అసూయతో గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారని బాధ్యులని గుర్తించి వారి పై చర్యలు తీసుకోవాలని పోలీసులకి పిర్యాదు చేశారు.

# ఏపీలో ప్రతీ కుటుంబానికి 'ఫ్యామిలీ డాక్టర్'

## - డబ్ల్యూఈఎఫ్ సదస్సులో వైఎస్ జగన్




దావోస్ : దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో రోజు (సోమవారం) ఫ్యూచర్ ప్రూఫింగ్ హెల్త్ సిస్టమ్స్ అంశంపై మాట్లాడారు. డబ్ల్యూఈఎఫ్ పబ్లిక్ సెషన్‌లో పాల్గొన్న ఆయన ఏపీలో కోవిడ్ నియంత్రణకు తీసుకున్న చర్యలతో పాటు రాష్ట్రంలో వైద్య వ్యవస్థలు ఎలా బలోపేతం చేస్తున్నది వివరించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం తీరు తెన్నులను వెల్లడించారు.

### కోవిడ్ నియంత్రణ

ఏపీలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా కోవిడ్ నియంత్రణ కార్యాచరణ అమలు చేశాం. 44 ఇళ్లు ఒక యూనిట్‌గా ఇంటింటికి సర్వే చేపట్టాం. ఇందు కోసం ప్రతీ 50 ఇళ్లకు ఒక వలంటీర్ వంతున పని చేశారు. 42 వేల మంది ఆశావర్కర్లు ఇందులో పాలు పంచుకున్నారు. ఇంటింటికి వెళ్లి కోవిడ్ లక్షణాలు కనిపించిన వారిని గుర్తించాం. ప్రత్యేకంగా ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. మెడిసిన్స్ అందించాం. రోగులు అవసరమైన పౌష్టిక ఆహారం అందిస్తూ పకడ్బందీ ప్రణాళిక అమలు చేశాం. అందువల్లే కరోనా మరణాల రేటు ఏపీలో జాతీయ స్థాయి కన్నా చాలా తక్కువగా దేశంలోనే అత్యల్పంగా 0.6 శాతంగా నమోదు అయ్యింది.

### ఫ్యామిలీ డాక్టర్ తరహాలో

ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. ఆ తర్వాత ఏవైనా రోగాలు వస్తే వాటికి సరైన సమయంలో వైద్యం అందివ్వడమనేది మరో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలను సెంట్రిక్‌గా చేసుకుని ఏపీలో హెల్త్‌కేర్ సిస్టమ్‌ని రెడీ చేశాం. రాష్ట్రంలో రెండు వేల జనాభా కల్గిన ఒక గ్రామంలో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశాం. వీటిపైన ప్రతీ 13 వేల జనాభా మండలం యూనిట్‌గా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాము. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు డాక్టర్లు ఉంటారు. అంటే ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఈ పీహెచ్‌సీలకు అనుబంధంగా 104 అంబులెన్సులు ఉంటాయి. పీహెచ్‌సీలో ఉన్న డాక్టర్లకు కొన్ని గ్రామాల బాధ్యతలను అప్పగించాం. రోజు విడిచి రోజు ఈ డాక్టర్లు అంబులెన్సుల ద్వారా గ్రామాలకు వెళ్తారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతారు... వీరంతా ఆ గ్రామంలోని ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్లుగా మారుతారు. పేరు పెట్టి పిలిచే సాన్నిహిత్యంతోపాటు ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ డాక్టర్లకు తెలుస్తుంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఏదైనా సమస్యలు వచ్చినా మొగ్గ దశలోనే దానికి చికిత్స అందించే వీలు ఉంటుంది.

### వైద్య వ్యవస్థ బలోపేతం

మండల స్థాయి దాటి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ హాస్పటిల్స్ చికిత్స అందిస్తాయి. ప్రతీ పార్లమెంటు యూనిట్‌గా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం. ఈ కాలేజీలకు అనుబంధంగా టీచింగ్ కాలేజీలు వస్తాయి. అక్కడ పీజీ స్టూడెంట్స్ ఉంటారు. వీళ్లంతా హెల్త్‌కేర్‌లో భాగమవుతారు. దీని ద్వారా హెల్త్‌కేర్ సిస్టమ్ బలోపేతం అవుతుంది.

మూడేళ్లలో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా వైద్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. మా ప్రభుత్వం రావడానికి ముందు 11 మెడికల్ కాలేజీలు ఉంటే కొత్తగా 16 మెడికల్ కాలేజీలు మంజూరు చేశాం. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గం ఒక యూనిట్‌గా మెడికల్ కాలేజీలు ఉండటం వల్ల అన్ని చోట్ల హెచ్చుతగ్గులు లేకుండా వైద్యవ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇందు కోసం ఇప్పటికే రెండు బిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయించాం. మూడేళ్లలో ఫలితాలు అందుతాయి. ఏపీలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా కోవిడ్ నియంత్రణ కార్యాచరణ అమలు చేశామని సీఎం జగన్ తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఇన్సురెన్స్ కమ్యూనిటీ హెల్త్ ఇన్సురెన్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అనే పథకం అమలు చేస్తోంది. ఇందులో వెయ్యికి పైగా అనారోగ్య సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. కానీ అంతకంటే మిన్నంగా ఏపీలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నాం. ఇందులో ఏకంగా 2,446 రకాల అనారోగ్య సమస్యలకు చికిత్సలు అందిస్తున్నాం. ఐదు లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన 1.44 కోట్ల కుటుంబాలు ఈ పథకం ద్వారా సేవలు పొందుతున్నారు. గత మూడేళ్లలో 25 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్య సాయం అందించామని సీఎం జగన్ వెల్లడించారు.

# ఆమదాలవలస రైల్వేస్టేషనుకు మహర్ధశ

## - రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ వెల్లడి



శ్రీకాకుళం (విజయభాను న్యూస్): శ్రీకాకుళం జిల్లాలో గల ఆమదాలవలస రైల్వేస్టేషన్ పురాతనమైందని, అటువంటి రైల్వేస్టేషనుకు మహర్ధశ రానుందని రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ వెల్లడించారు. సోమవారం ఆమదాలవలస వంశధార అతిథి గృహంలో నియోజకవర్గంలో చేపడుతున్న రైల్వే పనులపై విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డి.ఆర్.ఎం) అనూప్ కుమార్ శతపతి తో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ ఆమదాలవలస రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని, ప్రయాణీకులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరగా రైల్వే అధికారులు స్పందిస్తూ ఐరన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించిన సంగతి విదితమేనని అన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పునరుద్ధరించాలని కోరడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో స్టైయిన్ లెస్ స్టీల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆమదాలవలస రైల్వేస్టేషనులో పూర్తయిందని, ఇది ఎంతో గర్వకారణమని తెలిపారు.

ఈ నెల 30 నాటికి స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని రైల్వే అధికారులు తెలియజేసినట్లు ఆయన చెప్పారు. దేశంలో రెండవ స్టైయిన్ లెస్ స్టీల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఇదని, తొలుత పూండిలో నిర్మించడం జరిగిందని, రెండవది ఆమదాలవలసలో నిర్మించినట్లు ఆయన వివరించారు. ఇందుకు విశాఖపట్నం రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కృషి ఎంతో ఉందని సభాపతి గుర్తుచేసారు. అలాగే పలాస విశాఖపట్నం మార్గంలో నడిచే డిఎంయు రైలును కోవిడ్ కారణంగా నిలిపివేయడం జరిగిందని, దాన్ని తిరిగి పునరుద్ధరించాలని రైల్వే అధికారులను కోరామని, జూలై 1 నుండి పలాస నుండి విశాఖకు డిఎంయు రైలును నడపనున్నట్లు తెలిపారు. దీంతో పలాస %--% విశాఖపట్నం ప్రయాణీకులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని సభాపతి ఆశాభావం వ్యక్తం చేసారు. ఆమదాలవలస రైల్వేస్టేషనులో 14 సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లు ఆగడం లేదని, వాటిపై చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖకు సమాచారం అందించడం జరిగిందని, దీనిపై రైల్వే అధికారులు చొరవ చూపుతున్నట్లు సభాపతి స్పష్టం చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో పొందూరు దగ్గర వూసవానిపేటలో రూ.42 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి ( ఆర్.ఓ.బి ) నిర్మించడం జరుగుతుందని, ఇందుకు జరుగు తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , ఇతర అధికారులు దీనికి సంబంధించిన పనులు ఇప్పటికే పూర్తిచేసినట్లు ఆయన చెప్పారు. ఆమదాలవలస రోడ్ అండర్ బ్రిడ్జి సమస్య ఉందని, బ్రిడ్జి క్రింద నీరు నిలిచిపోవడంతో కొన్నిసమయాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నట్లు గుర్తించడం జరిగిందని, వీటిపై కూడా రైల్వే అధికారులు స్పందించి ఆ పనులను కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు సభాపతి వివరించారు. ఆమదాలవలస పురపాలక సంఘం నుండి సుమారు కోటి రూపాయల వరకు సర్వీస్ ఛార్జీలు చెల్లించాల్సి ఉందని, అయితే నిధులు కొరత వలన మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ఆమదాలవలస రైల్వేస్టేషనులో చేపడుతున్న రైల్వే పనుల వలన త్వరలోనే మహర్ధశ రానుందని చెప్పారు. అనంతరం డిఆర్ఎంతో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొని రైల్వే పనుల పురోగతిని సభాపతి స్వయంగా పరిశీలించారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ శతపతి మాట్లాడుతూ జాతీయ విధానంలో భాగంగా దేశంలో తొలిసారిగా స్టైయిన్ లెస్ స్టీల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పూండిలో నిర్మించడం జరిగిందని, రెండవది ఆమదాలవలస రైల్వేస్టేషనులో ( శ్రీకాకుళం రోడ్ ) నిర్మించినట్లు చెప్పారు.

దీన్ని ఈ నెల 30నాటికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలోనే రెండు వంతెనలు నిర్మాణాలు చేపట్టడం ఎంతో గర్వకారణమని అన్నారు. వూసవానిపేట రైల్వే వంతెన త్వరలోనే పూర్తికానుందని, ఆమదాలవలస అండర్ గ్రౌండ్ బ్రిడ్జిపై ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని, త్వరలోనే పూర్తికానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పలాస విశాఖపట్నం డిఎంయును జూలై నుండి పునరుద్దరిస్తున్నామని, సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లు అన్నీ శ్రీకాకుళంలో నిలిచేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం రైల్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేసారు.

# ఎన్నికలకు ముందు పట్టాలకు అర్హులైన వారు ఇప్పుడు ఎందుకు అర్హులు కారు

## టీడీపీ పార్లమెంటరీ సెక్రటరీ పిట్టా సురేష్

భీమునిపట్నం (విజయభాను న్యూస్): పట్టాల పంపిణీ కార్యక్రమం చాలామందికి నిరాశ కలిగిం చిందని టీడీపీ పార్లమెంటరీ సెక్రటరీ పిట్టా సురేష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు సుమారు పదివేల మందికి హామీ పత్రాలు అందజేసి పంపిణీ కార్యక్రమంలో మూడు వేల మందికి మాత్రమే పట్టాలు ఇవ్వండ పై ఎన్నికలకు ముందు అర్హులైన వారు ఇప్పుడు ఎందుకు అర్హులు కాదో తెలపాలని డిమాండ్ చేసారు. పట్టాలు వచ్చాయనీ సంతోషం ఉందా అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళస్థలం 1.5 సెంట్ల స్థలం కేటాయిస్తామని చెప్పి ఒక సెంటు స్థలానికి మాత్రమే పత్రాలు అందజేశారనీ, ఇంతవరకు అర్బన్ ప్రాంతంలో అన్ని వసతుల మధ్య నివసిస్తున్న వారికి కనీస మౌలిక వసతులు లేని ప్రాంతంలో ఇల్లు నిర్మాణం వెంటనే ప్రారంభించాలని నిబంధనలతో కూడిన పత్రాలపై సంతకాలు చేయించుకొని ఇల్లు నిర్మాణం ప్రారంభించక పోయినట్లయితే ఇళ్ళ పట్టాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారనీ. ప్రభుత్వం అందించే లక్షా ఎనభై వేల రూపాయలతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తవుతుందనీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమం ప్రదాన ఉపాధ్యాయరాలు మొకర పద్మా వతి అధ్యక్షత న జరిగింది.

# ఎం.అలమండలో వివాహిత మృతిపై విచారణ



దేవరాపల్లి (విజయభాను న్యూస్) మండలంలోని ఎం.అలమండ గ్రామంలో ఆదివారం గునూరు మాధవి (28) అను వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ పి. సింహాచలం కేసు నమోదు చేశారు. సోమవారం అనకాపల్లి డి.ఎస్.పి బి. సునీల్ ఈ కేసు విషయమై దర్యాప్తు జరిపి కుటుంబీకులను ఒక్కొక్కరిగా మాట్లాడించి వారినుంచి విషయాలను తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ జె. రమేష్ బాబు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని చోడవరం పోస్టుమార్టం కి తరలించారు.

# ఏడు వలంటీర్ పోస్టులకు నలుగురు దరఖాస్తు

దేవరాపల్లి, (విజయభాను న్యూస్) మండలంలోని రైవాడ, దేవరాపల్లి-1, మామిడిపల్లి, చింతలపూడి, కొత్త పెంట ఏ. కొత్తపల్లి, ఎన్.జి.నగరం, గ్రామాల నుంచి ఒక్కొక్క వలంటీర్ పోస్ట్ కు దరఖాస్తు చేసుకోవాలని ఇటీవలే ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ప్రకటన విడుదల చేశారు. ఈ ఉద్యోగ అవకాశాలు నిమిత్తం ఆయా గ్రామాల నుంచి కేవలం నలుగురు మాత్రమే ఆన్లైన్లో దరఖాస్తు చేసి సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూ లకు ఆ నలుగురు హాజరయ్యారు. ఎన్.జి.నగరం నుండి ఇద్దరు, కొత్తపెంట నుండి ఒకరు, ఏ. కొత్తపల్లి నుంచి ఒక్కరు, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మిగిలిన గ్రామాల నుంచి కనీసం దరఖాస్తు కూడా చేయకపోవడం విశేషం.

# హన్సిక మోత్వానీ గ్లామర్ స్టిల్స్



ఆమె ప్రధానంగా తమిళం మరియు తెలుగు చిత్రాలలో నటించింది. హన్సిక మోత్వానీ ఆగస్టు 9, 1991న మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. హన్సిక తన బుల్లితెర కెరీర్‌ను షక లక బూమ్ బూమ్ అనే సిరీస్‌తో ప్రారంభించింది. తర్వాత భారతీయ సిరీస్ దేస్ మైన్ నిక్లా హెూగా చంద్‌లో నటించాడు.ఆమె 15 సంవత్సరాల వయస్సులో పూరి జగన్నాథ్ యొక్క తెలుగు చిత్రం దేశముదురులో తొలిసారిగా నటించింది మరియు తన నటనకు ఫిలింఫేర్ ఉత్తమ తొలి నటి అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత హిమేష్ రేష్మియాతో కలిసి హిందీ చిత్రం ఆప్ కా సురూర్‌లో నటించాడు. ఆమె 2008 కన్నడ చిత్రం బిందాస్‌లో సూపర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌తో కలిసి నటించింది. ఆమె 2017లో విలన్ సినిమాతో మలయాళంలో అరంగేట్రం చేసింది. వరుడు సినిమాతో తమిళ సినీ రంగ ప్రవేశం చేసింది హన్సిక. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లినా ప్రేమ, వేలాయుధం, ఒక రాయి ఒక గాజు, థియా వర్కింగ్ సన్, లయన్‌ార్యానీ, జింక కరాటే, ప్యాలెస్, అంబాలా, రోమియో జూలియట్, కులేబకావళి వంటి చిత్రాల్లో నటించింది . ఆయన రాబోయే సినిమాలు మహా, పార్టనర్, రౌడీ బేబీ, మై నేమ్ ఈజ్ శృతి.తాజాగా లెహంగా ధరించిన హన్సిక ఆహా ఫొటోస్ సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. ఆకర్షణీయమైన గ్లామర్ లుక్ లో మెరిసిపోతుంది.

# సీరత్ కపూర్ నయా షో



ముంబై భామ సీరత్ కపూర్ మల్టీ టాలెంటెడ్. మోడల్, డ్యాన్సర్, కొరి యోగ్రాఫర్ కూడా. 'రన్ రాజా రన్' తో తెలుగు తెరకు పరిచయం అయింది. మెరుపుతీగలా కనిపించే ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోయిన్ అయిపోవడం ఖాయం అనుకున్నారు. కానీ ఒక్క మాస్ మహారాజా రవితేజ తప్ప.. మరో స్టార్ హీరో ఈ బ్యూటీని పట్టించుకోలేదు. టైగర్, టచ్ చేసి చూడు సినిమాల్లో సీరత్ హీరోయిన్ గా చేసింది. ఇవిగాక.. రాజుగారి గది 2, ఒక్క క్షణం, కోలంబస్, కృష్ణ అండ్ హిజ్ లీలా, మా వింత గాధ వినుమా.. తదితర సినిమాల్లో నటించింది. ప్రస్తుతం సీరత్ చేతిలో సినిమాలేమీ లేవు. అయినా.. నిరాశ పడకుండా తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. మరో అవకాశం కోసం తనలోని హాట్నెస్ ని అన్ని యాంగిల్స్ లో చూపించే పనిలో ఉంది. తాజాగా లావెండర్ స్లిట్ డ్రెస్లో మెరిసింది. టాప్ టు బాటమ్ అందాలు హైలెట్ అయ్యేలా పోజులు ఇచ్చింది.

# లతగ్గేది లే అంటున్న అష్షురెడ్డి



బుల్లి తెరపై అందాల అరాచకం అష్షురెడ్డి, అస్సలు తగ్గనంటోంది. మేని ఛాయతో మెస్మరైజ్ చేస్తోంది. కొంటె చూపులతో కుర్రాళ్ల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. లేటేస్ట్ హాట్ ఫొటోలతో కదలనీయకుండా చేస్తోంది అష్షు. అచ్చం సమంత లా ఉండే అష్షు జూనియర్ సమంతగా పేరు తెచ్చుకుంది. అషురెడ్డి గతంలో డబ్ స్మాష్ వీడియోలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. హాట్ ఫొటోషూట్లతో సోషల్ మీడియాలో రచ్చరచ్చ చేస్తోంది. ట్రెండీ వేర్ లో కుర్రాళ్లకు పిచ్చేక్కిస్తోంది అషురెడ్డి.

# జెట్ స్పీడ్ లో నిఖిల్ భారీ థ్రిల్లర్ షూట్.!



యంగ్ అండ్ టాలెంటడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ హీరోగా ఇప్పుడు మరిన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. మరి వాటిలో తన కెరీర్ హై బడ్జెట్ సినిమా అయినటువంటి ప్రాజెక్ట్ "స్పై" కూడా ఒకటి. రీసెంట్ గా అనౌన్స్ అయ్యిన ఈ చిత్రాన్ని దర్శకుడు గ్యారీ బి హెచ్ శరవేగంగా తెరకెక్కిస్తున్నాడట.భారీ యాక్షన్ సీక్వెన్స్ లను కంప్లీట్ చేస్తూ ప్రస్తుతం ఈ చిత్రం జెట్ స్పీడ్ లో షూటింగ్ ని జరుపుకుంటున్నట్టు చిత్ర యూనిట్ ఒక ఫోటో ని కూడా షేర్ చేశారు. అయితే ఈ చిత్రానికి హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ విటేకర్ చేస్తుండడం విశేషం.ఇక ఈ సినిమాలో ఐశ్వర్య మీనన్ హీరోయిన్ గా నటిస్తుండగా ఈడీ ఎంటర్టైన్మెంట్స్ స్థాయిలో నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ చిత్రం పాన్ ఇండియా లెవెల్లో ఈ ఏడాది దసరా రేస్ లో రిలీజ్ కానుంది.

# ఎఫ్3కి 'యూ' సర్టిఫికేట్




బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ఎఫ్ 2 చిత్రానికి సీక్వెల్‌గా ఎఫ్3 రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయాయి. విక్టరీ వెంకటేష్, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోలుగా, తమన్నా, మెహ్రీన్ హీరోయిన్లుగా నటించారు. ఓ పాటలో పూజా హెగ్డే అలరించబోతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ మూవీని 27 మే భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. 2 గంటల 28 నిమిషాల రన్ టైమ్ తో ఈ సినిమాకి క్లీన్ 'యూ' సర్టిఫికేట్ వచ్చిందని మేకర్స్ తెలిపారు. అయితే ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు, ఇటీవల కాలంలో ఈ రేంజ్ కామెడీ జోనర్ మూవీ రాలేదని, ఇది ఖచ్చితంగా ప్రేక్షకులను అలరించడం ఖాయమని కితాబిచ్చారు. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు - శిరీష్ నిర్మించారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# ఏండ్ల కఠోర శ్రమ ఫలితమే ఈ విజయం

**- నయా వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్**

**ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యం !**

బంగారు బాక్సర్ నిఖత్ జరీన్ నయా తుఫాన్ సృష్టించింది. 14 ఏండ్ల వయసులోనే జూనియర్ వరల్డ్ చాంపియన్‌గా అవతరించిన తెలంగాణ తేజం.. అత్యున్నత స్థాయిలో తనేంటూ నిరూపించుకునేందుకు దశాబ్దానికి పైగా చెమటోడ్చింది!.

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించి ఇస్తాంబుల్‌లో చిరస్మరణీయ విజయం అందుకుంది.

పసిడి పంచ్‌తో యావత్ దేశం దృష్టిని తనవైపుకు



తిప్పుకుంది. కామన్‌వెల్త్ క్రీడల కోసం సన్నద్ధం కానున్న నిఖత్ జరీన్.. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యమని చెబుతోంది.

# సెమీస్‌లో సింధు

బ్యాంకాక్ : రెండు సార్లు ఒలింపిక పతక విజేత, భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు థారులాండ్ ఓపెన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. వరల్డ్ నం.1 అకానె యమగూచి (జపాన్)పై పి.వి సింధు 2-1తో మెరుపు విజయం నమోదు చేసింది. మూడు గేముల పాటు హెూరాహెూరీగా సాగిన క్వార్టర్‌ఫైనల్లో 21-15, 20-22, 21-13తో యమగూచిపై సింధు గెలుపొందింది. థారులాండ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆరోసీడ్ భారత షట్లర్ 51 నిమిషాల్లోనే సెమీస్ బెర్త్ సొంతం చేసుకుంది. నేడు ఫైనల్లో చోటు కోసం చైనా స్టార్ షట్లర్ చెన్ యుఫెరుతో తలపడనుంది.మూడో గేమ్‌లో అకానె యమగూచిపై సింధు ఎదురులేని ప్రదర్శన చేసింది. యమగూచిని చిత్తు చేసి 21-13తో తిరుగులేని విజయం నమోదు చేసింది. మూడో గేమ్‌తో పాటు సెమీఫైనల్స్ బెర్త్ కైవసం చేసుకుంది.




# రామ్‌చరణ్ విడుదల చేసిన 'విక్రమ్' తెలుగు ట్రైలర్




లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కమల్ హాసన్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'విక్రమ్' జూన్ 3న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా తెలుగు థియేట్రికల్ ట్రైలర్ రామ్‌చరణ్ విడుదల చేశారు. కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ కలిసి రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రేష్ట్ మూవీస్ తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాని విడుదల చేయనుంది. ఇప్పటికే తమిళం, హిందీ భాషల్లో విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కి విశేష స్పందన వస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్, సినిమాటోగ్రఫీ గిరీష్ గంగాధరన్, ఎడిటింగ్ ఫిలోమిన్ రాజ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో ఫాహద్, విజయ్ సేతుపతి ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. సూర్య అతిధి పాత్రలో కనిపించనున్నారని ఇటీవలె చిత్రబృందం ప్రకటించింది.

# ప్రముఖ నటుడు చలపతి చౌదరి కన్నుమూత



ప్రముఖ నటుడు కెప్టెన్ చలపతి చౌదరి (67) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన కర్ణాటకలోని రారుచూర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త విన్న పలువురు సెలబ్రిటీలు చలపతి చౌదరికి నివాళులు అర్పిస్తున్నారు. విజయవాడకు చెందిన చౌదరి రారుచూర్‌లో స్థిరపడ్డారు. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో వందకు పైగా సినిమాల్లో నటించారు. చిరంజీవి, శివరాజ్ కుమార్, బాలకృష్ణ వంటి అగ్ర హీరోల చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు. బుల్లితెర సీరియళ్లలోనూ కనిపించారు. ఇటీవల ఆయన నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' చిత్రంలోనూ కనిపించి మెప్పించారు.

# 'ఎన్టీఆర్ 31' ఫస్ట్‌లుక్




జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ పరిశ్రమకు చెందినవారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో రామ్ చరణ్ సోషల్ మీడియా ద్వారా స్పెషల్ ఫొటోతో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. "సోదరుడు, సహ నటుడు, స్నేహితుడు.. నాకు తారక్ ఎవరో పదాలు నిర్వచించగలవని నేను అనుకోను. జన్మదిన శుభాకాంక్షలు" అంటూ పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్‌తో చేయబోయే చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ఎన్టీఆర్ 31' అనే పేరుతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2023, ఏప్రిల్‌లో ప్రారంభమవుతుంది. ఈ యాక్షన్ డ్రామాను ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు.

# మళ్ళీ కలిసిన ఎన్టీఆర్ - త్రివిక్రమ్



చిత్రసీమలో విబేధాలు సహజం. ఒకరికి నచ్చిన విషయం మరొకరికి నచ్చాలని రూల్ లేదు. ఒకరి ఆలోచనలను మరొకరి విజులైజేషన్ లోకి తీసుకు వచ్చి, అతనిని మెప్పించిన వాడే సూపర్ డూపర్ హిట్లు కొడతాడు. ఆ వ్యక్తి దర్శకుడైనా, హీరో, నిర్మాత ఎవరైనా కావొచ్చు.

# అర్జీలను కాలపరిమితిలోగా పరిష్కరించాలి

## స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

**- జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భముగా జిల్లా కలక్టరు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు స్పందనలో వచ్చిన దరఖాస్తులు వాటి పరిష్కారము, పెండెన్సీ పై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని, కాలపరిమితిలోగా దరఖాస్తులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జీ.వీ.యం.సీ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు.

బియాండ్ ఎస్ఎల్ఎ అర్జీలు పెండింగ్ లో లేకుండా తగు చర్యలు తీసుకోవాల న్నారు. ఏ. పీ. సేవ పోర్టల్ ద్వారా సచివాల యంలో వినతులు స్వీకరించాలని అన్నారు. ఒక వారానికి ఒక సచివాలయం లో చాలా తక్కువ అప్లికేషన్స్ వస్తున్నాయి అని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జీ.వీ. యం.సీ అధికారులకు ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న జగనన్న తోడు, విద్య దీవెన వంటి ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందించే విషయం లో అలసత్వం వలదని అధికారుల ను ఆదేశించారు.

విద్యుత్ మీటర్ల ఆధార్ సీడింగ్ వెంటనే పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఎక్కడ ఖాళీలు ఉండకూడదని ఎం.పి.డి.ఓ లకు ఆదేశించారు.

తదుపరి జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో 185 విజ్ఞప్తులు అందాయి. జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భారత్-జపాన్ సహజ భాగస్వాములు

**: ప్రధాని మోదీ**




టోక్యో : భారత్, జపాన్ సహజ భాగస్వాములని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జపనీయుల పెట్టుబడులు భారతదేశ అభివృద్ధి గమనంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జపాన్‌కు వెళ్లిన ప్రధాని.. తొలి రోజు టోక్యోలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించారు. జపాన్‌తో భారత్ బంధం ఆధ్యాత్మికమైందని, సహకారంతో కూడుకున్నదన్నారు. "భారత్, జపాన్ సహజ భాగస్వాములు. భారత అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక పాత్ర పోషిస్తోంది. నేటి ప్రపంచం బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రపంచం ఎదుర్కొంటోన్న హింస, అరాచకం, ఉగ్రవాదం, వాతావరణ మార్పులు.. ఇలాంటి అనేక సవాళ్ల నుంచి మానవాళిని అదే కాపాడుతుంది" అని వ్యాఖ్యానించారు.


ఎంత పెద్ద సమస్య వచ్చినా భారత్ పరిష్కారాన్ని కనుగొంటోందని.. కరోనా మహమ్మారి సమయంలో అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నా మేడిన్ ఇండియా వ్యాక్సిన్లు కోట్లాది భారతీయులతో పాటు దాదాపు 100 దేశాలకు సరఫరా చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తాను జపాన్‌కు ఎప్పుడు వచ్చినా అందరూ తమ ఆప్యాయత చూపిస్తున్నారని ప్రవాస భారతీయులను ఉద్దేశించి అన్నారు. "మీలో చాలా మంది ఎన్నో ఏళ్ల క్రితం జపాన్ వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడి సంస్కృతిని అలవర్చుకున్నారు. అయినప్పటికీ భారతీయ సంస్కృతి, భాషల పట్ల నిబద్ధత పెరుగుతోంది" అంటూ మోదీ పేర్కొనగా.. ప్రవాస భారతీయులు 'భారత్ మాతాకీ జై' నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. మరోవైపు, భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ కలిసి ఏర్పాటు చేసిన క్వాడ్ కూటమి సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. జపాన్ ప్రధాని కిషిదతో, ఆస్ట్రేలియా కొత్త ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌తో చర్చలు జరపనున్నారు.

# వర్తమాన రాజకీయాలలో జగన్ ఓ సరికొత్త చరిత్ర

**- జగన్ దావోస్ పర్యటనపై టీడీపీ విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది**

**- దావోస్ పర్యటనకు వెళ్లి బాబు, లోకేష్ లు ఎంత మేర పెట్టుబడులు తెచ్చారో చెప్పాలి**

## ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయిరెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వర్తమాన రాజకీయాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్థానం ఓ సరికొత్త చరిత్ర అని, పొత్తుల్లేకుండా పోరాడి గెలిచిన నాయకుడిగా సత్తాచాటారని, వినూత్న పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శిగా నిలిచారని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. ఒంటరిగా సైన్యాన్ని నడిపించి అఖండ విజయాలు సాధించిన పరాక్రమవంతులు ఏడుగురు అని ప్రపంచ చరిత్ర చెబుతోందని, వారిలో అలెగ్జాండర్ ద గ్రేట్, అశోక చక్రవర్తి, మహారాణా ప్రతాప్ వంటి వారున్నారని అన్నారు. అదే కోవకు చెందిన జగన్ వర్తమాన రాజకీయాలలో ఓ సరికొత్త చరిత్ర అని కీర్తించారు. జగన్ దావోస్ పర్యటనపై టీడీపీ విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుందని, 2019 జనవరిలో లోకేష్ టీం జూరిచ్ నుంచి దావోస్ కు ట్రిప్పుకు 10 వేల డాలర్ల చెల్లించి హెలికాప్టర్ల లో వెల్లిందని , ప్రస్తుత దావోస్ పర్యటనలో జగన్ రోడ్డు మార్గాన ప్రయాణించారని తెలిపారు. దావోస్ పర్యటన అనంతరం లోకేష్ టీం 10 రోజులు అమెరికాలో తిరిగొచ్చిందని గుర్తుచేశారు. ఆ మొత్తం పర్యటనకు సంబంధించిన ఖర్చులు సంగతి త్వరలోనే బయటపెడతామని అన్నారు. దావోస్ పర్యటనకు ఎగబడి వెల్లిన బాబు, లోకేష్ లు రాష్ట్రానికి ఎన్ని వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు.

ఆ పర్యటకు బాబు, లోకేష్ లు చేసిన ఖర్చు ఎలాగూ ప్రభుత్వం లెక్క తీస్తుందని అన్నారు.

# జివిఎంసిలో "స్పందన" కార్యక్రమం నిర్వహణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాల యంలో పాత సమావేశ మందిరం నందు "స్పందన" కార్యక్రమం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నిర్వహించారు.

**"స్పందన" కార్యక్రమంలో స్వీకరించిన 74 ఫిర్యాదులు:** "స్పందన" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా స్వీకరించిన ఫిర్యాదులు ఒకటవ జోనుకు 01, రెండవ జోనుకు 08, మూడవ జోనుకు 12, నాలుగవ జోనుకు 11, అయిదవ జోనుకు 21, ఆరవ జోనుకు 10, ఎనిమిదవ జోనుకు 07, మెయిన్ ఆఫీసునకు 04, మొత్తము 74 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమం అనంతరం మేయర్ మాట్లాడుతూ "స్పందన" కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు / వినతులపై సంబందిత అధికారులు తక్షణమే పరిష్కార మార్గం చేపట్టి, సమస్యలు పరిష్కారమైనవీ, లేనివీ ఫిర్యాదు దారులను అడిగి తెలుసుకోవా లన్నారు. ఈ వారం వచ్చే ఫిర్యాదులు/వినతులు వచ్చే వారం పునరావృత్తి కాకుండా ఉండేటట్లు నిర్ణీత సమయంలో సరైన పరిష్కారం చూపాలన్నారు. పైన తెలిపిన ఫిర్యాదులను పరిశీలించిన ఆమె, మాట్లాడుతూ స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరిం చేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, సిసిపి ఎ. ప్రభాకర రావు, జె.డి.(అమృత్) విజయ భారతి, సిఎంఒహెచ్ డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, ఎఫ్.ఎ. ఎ.ఒ. మల్లికాంబ, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రెడ్డి, ఎ.డి.(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, డి.సి. (రెవెన్యూ) పి. నల్లనయ్య, డిఇఒ శ్రీనివాస రావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్లు శివ ప్రసాద్ రాజు, వినయ్ కుమార్, వేణుగోపాల్, గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

# చట్టం తనపని తాను చేసుకుపోతుంది : మంత్రి బొత్స



విజయనగరం: ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని.. 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అనంతబాబు వ్యవహారంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. అందులో ప్రభుత్వం జోక్యం చేసుకోదన్నారు. కాగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసును పోలీసులు విచారిస్తున్నారు.

విచారణ పూర్తికాగానే అనంతబాబును రిమాండ్‌కు తరలిస్తామని ఏఎస్పీ పేర్కొన్నారు. 19వ తేదీ రాత్రి సుబ్రహ్మణ్యం వెంట ఉన్న స్నేహితులను పోలీసులు విచారిస్తున్నారు.

# తప్పు చేస్తే ఎమ్మెల్సీ అయినా చర్యలు తప్పవు : మంత్రి అంబటి



అమరావతి: చట్టానికి ఎవరూ అతీతులు కారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అయినా సరే చర్యలు తీసుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారన్నారు. తప్పు చేస్తే ఎమ్మెల్సీ అయినా చర్యలు తప్పవన్నారు.

"మంగళగిరిలో ఓడిపోయిన లోకేష్ మా గురించి మాట్లాడతారా? పోలవరం ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు. మీ నిర్వాకం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. లోకేష్.. పార్టీకి పట్టిన శనిగా చెప్పుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తున్న నాయకుడు. రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు" అంటూ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com